సాక్షి వరంగల్
గురువారం | 16 | జనవరి | 2025



ముగిసిన సెపక్‌తక్రా పోటీలు
హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో ఐదురోజులపాటు నిర్వహించిన సెపక్‌తక్రా పోటీలు బుధవారం ముగిశాయి. - 8లో▸



ఎన్పీడీసీఎల్‌కు అవార్డులు
నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి నాలుగుకు ఇపాయి (ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) అవార్డులు లభించాయి. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29^0 / 19^0
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది

న్యూస్‌రీల్

గిరిజనులు అర్జీలను అందించాలి

వరంగల్: ఏటూరునాగారం ఐటీడీఏ అధికారి ఆదేశాల మేరకు గిరిజనుల నుంచి శుక్రవారం అర్జీలను స్వీకరిస్తామని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్ ఎదుట ఉన్న ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో వరంగల్ జిల్లాలోని గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు అందించాలని కోరారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

గీసుకొండ: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, చదువుపై శ్రద్ధ చూపాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సీహెచ్. అన్వేష్ సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం గంగదేవిపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్ కొక్కొండ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు కూసం రాజమౌళి, గోనె మల్లారెడ్డి పోటీల ఆర్గనైజర్ మాడిశెట్టి రాముడు నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీకి నిప్పు



చెన్నారావుపేట: మండలంలోని జల్లీ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ ఫ్లెక్సీకి మంగళవారం రాత్రి నిప్పు పెట్టారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగగిరిలో జరుగుతున్న చెన్నకేశవస్వామి జాతరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫొటోతో స్థానిక నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీకి నిప్పు పెట్టి కాల్చినట్లు తెలిపారు. దీంతో జల్లీ కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల గొడవ

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రి అంబులెన్స్ డ్రైవర్ల మధ్య మంగళవారం రాత్రి గొడవ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన అత్యవసర రోగులను వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ లాంటికి తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌లను పెట్టుకుని డ్రైవర్లు ఉంటున్నారు. అంబులెన్స్‌లు సీరియల్ ప్రకారం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ రోగిని సీరియల్ ప్రకారం కాకుండా ఓ డ్రైవర్ అంబులెన్స్‌లో హనుమకొండకు తీసుకెళ్లడంతో గొడవ ప్రారంభమైంది. దీంతో వివాదం ముదిరి కొట్టుకునే వరకు రావడంతో స్థానికులు గమనించి డయల్ 100కు కాల్ చేశారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వివరాలు తీసుకొని పంపించారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా అంబులెన్స్ సీరియల్ విషయం డ్రైవర్లు గొడవపడ్డారని, డయల్ 100కు ఫోన్ రావడంతో వెళ్లి వారిని పంపించినట్లు తెలిపారు. ఈఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

ఇద్దరి ఆత్మహత్య

సంగెం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోమ్లాతండాకు చెందిన గుగులోత్ బద్రి (70)కి పక్షవాతం వచ్చింది. దానికితోడు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో రోడ్ల వెంట తిరుగుతుండేది. ఈ నెల 14న కుటుంబ సభ్యులందరు వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లారు. వారు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బద్రి కనిపించలేదు. రాత్రిపూట తండా సమీపంలోని వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూసేసరికి చెప్పులు, దుప్పటి, కళ్లజోడు, చేతికర్ర బావి పక్కన కనిపించాయి. బావిలో చూసేసరికి బద్రి శవమై తేలి ఉన్నది. మృతురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..
పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద తండా శివారు మూల తండాకు చెందిన భూక్యా అరుణ(45)కు ఈ నెల 10న ఇంటి పనుల విషయంలో కోడలు మౌనికతో గొడవ జరిగింది. వ్యవసాయబావి వద్దకు వెళ్లిన అరుణ మనస్తాపంతో పురుగుల మందు తాగింది. సమీప పంట పొలంలో ఉన్న భూక్యా విమల చూసి ఫోన్ ద్వారా అరుణ కుమారుడు రాకేశ్‌కు తెలిపింది. వెంటనే ద్విచక్రవాహనంపై హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుదారుల ఎదురుచూపులు

- ఈనెల 26 నుంచి జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- 16 నుంచి 20 వరకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- 21 నుంచి 25 వరకు గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపిక
- జిల్లాలో 13 మండలాలు.. 2,66,662 కార్డులు

జిల్లాలోని 13 మండలాల్లో రేషన్‌కార్డుల వివరాలు..



మండలం	ఏఎఫ్ఎస్‌సీ	ఎఫ్ఎస్‌సీ	ఏఏపీ	మొత్తం
చెన్నారావుపేట	770	12,269	0	13,039
దుగ్గొండి	813	14,085	0	14,898
గీసుకొండ	784	17,672	0	18,456
ఖానాపురం	895	9,368	0	10,263
పర్వతగిరి	670	14,328	5	15,003
రాయపర్తి	611	15,855	0	16,466
సంగెం	607	14,216	0	14,823
వర్ధన్నపేట	871	14,265	0	15,136
నల్లబెల్లి	855	10,574	0	11,429
నర్సంపేట	1,367	20,953	0	22,320
నెక్కొండ	1,056	16,182	1	17,239
వరంగల్	2,608	47,296	1	49,905
ఖిలా వరంగల్	1,948	45,737	0	47,685

● ఏఎఫ్ఎస్‌సీ ● ఎఫ్ఎస్‌సీ ● ఏఏపీ ● మొత్తం

సాక్షి వరంగల్/ఖిలావరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అర్హులకు రేషన్‌కార్డులు అందించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. తెల్లరేషన్ కార్డు ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి. ఉచితంగా రేషన్ బియ్యం, ఆరోగ్యశ్రీ సేవలు, పిల్లల ఉన్నత విద్యకు ఉపకార వేతనాలు, ఇతర పథకాలకు రేషన్‌కార్డు ఉపయోగపడనుంది. ఇటీవల చేసిన కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.

ప్రజాపాలనలో సుమారు 29 వేల దరఖాస్తులు..
జిల్లాలోని 13 మండలాల్లో 13,855 ఏఎఫ్ఎస్‌సీ, 2,52,800 ఎఫ్ఎస్‌సీ, 7 ఏఏపీకి సంబంధించి మొత్తం 2,66,662 రేషన్‌కార్డులు ఉన్నాయి. కార్డుల్లో కొత్త పేర్ల నమోదుకు 34 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని తహసీల్దార్ లాగిన్, మరికొన్ని డీఎస్‌ఓ లాగిన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజాపాలనలో వివిధ పథకాల కోసం 2లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్‌కార్డుల కోసం ఆప్షన్ లేకపోవడంతో చాలా మంది తెల్లకాగితాలపై సుమారు 29వేల దరఖాస్తులు ఇచ్చారు. ఈనెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన, 21 నుంచి 25 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి రేషన్‌కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన మార్గదర్శకాలతో ఎవరు అర్హులో లెక్క తేలనుంది. ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే ఆధారంగా కుటుంబాల సంఖ్య లెక్క తేలింది. దీంతో ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేయాలని భావిస్తోంది.

13 మండలాల్లో ప్రత్యేక అధికారులు..
కొత్త రేషన్‌కార్డుల మార్గదర్శకాలపై కలెక్టర్ సత్య శారద స్పష్టత ఇచ్చారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీకి జిల్లాలోని 13 మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. 25లోపు అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు పథకాల్లో ప్రధానమైన రేషన్ కార్డుల జారీ ఉండడం విశేషం .

పారదర్శకంగా రేషన్‌కార్డుల జారీ

ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఆహార భద్రతా కార్డుల జారీ ప్రక్రియ ఉంటుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు వస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన కార్డులు, కార్డుల్లో పిల్లల పేర్లు నమోదవుతాయి. 16 నుంచి 20 వరకు పథకాలపై పరిశీలన, 20 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు సహకరించాలి.

- కిష్టయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి

పిల్లల పేర్లు నమోదు చేయాలి



నాతోపాటు నాకుమారుడికి తెల్ల రేషన్‌కార్డు ఉంది. నా కుమారుడి కార్డులో మనవడు, మనవరాళ్ల పేర్లు నమోదు కావాలి. ఇందుకోసం మీసేవలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాం. నమోదు కోసం పదేళ్లుగా ఎదరుచూస్తున్నాం. ఈనెల 26 నుంచి కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుండడం హర్షణీయం

- సార సాంబయ్య శివనగర్

అంబరాన్నంటిన సంక్రాంతి వేడుకలు



గీసుకొండ: ప్రత్యేకంగా అలంకరించిన ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



వర్ధన్నపేటలో ముగ్గు వేస్తున్న మహిళలు

గీసుకొండ: జిల్లాలో సంక్రాంతి, కనుమ పండుగలను మంగళ, బుధవారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట, మండల కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. మహిళలు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గీసుకొండ మండలం ఊకల్‌హవేలిలోనినాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణకుంభం, కాడెడ్లు, చెరకు గడలు, మొక్కలు, పాల కుండలతో గర్భగుడిని అలంకరించగా భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఆలయ అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష అలంకరణ, పూజలు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి, సంగెం మండలంలోని గవిచర్ల, ఆశాలపల్లి శివారులో ఉన్న పర్వతాల మల్లికార్జునస్వామి, పర్వతగిరి మండలం గోపనపల్లిలోని దూడల మల్లికార్జునస్వామి, రాయపర్తి మండలం పేర్కవేడులోని మల్లికార్జునస్వామి, వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల మల్లికార్జునస్వామి, చెన్నారావుపేట మండలం లింగగిరిలోని చెన్నకేశవస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



రాయపర్తి : పేర్కవేడు జాతరలో గొర్రెపోతులతో తయారుచేసిన బండిపై దేవతామూర్తుల ప్రదర్శన

పాకాలలో పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు



పాకాలో సందడి చేస్తున్న పర్యాటకులు

పాకాలలో బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి పాకాల అందాలను వీక్షించారు. సరస్సులో వారు బోటింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. - ఖానాపురం

రెండిళ్లలో నగలు, నగదు చోరీ

గీసుకొండ: సంక్రాంతికి ఊరికి వెళితే దొంగలు చొరబడి భారీగా నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. గొర్రెకుంట అపర్ణకాలనీలో నివాసం ఉంటున్న మిట్టపల్లి పరమేశ్వరితోపాటు ఆమె కుటుంబ సభ్యులు సంక్రాంతి పండుగ కోసం సొంత ఊరు ములుగు జిల్లా గోవిందరావుపేటకు ఈనెల 13న వెళ్లారు. మరుసటి రోజు మంగళవారం ఇంటి పక్క వారు ఫోన్ చేసి దొంగతనం జరిగిందని చెప్పారు. అక్కడి నుంచి పరమేశ్వరి వచ్చి వచ్చి చూడగా గేటు, ముందటి మెయిన్ డోరు, బెడ్‌రూంలోని బీరువాను పగులగొట్టి 35 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే, మండలంలోని బొడ్డుచింతలపల్లికి చెందిన గంప రవి తన భార్య మంజులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈనెల 13న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స చేయించి గిర్నిబావిలోని అతడి బావమరిది పాలకొండ శ్రీను ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి మెయిన్‌డోర్, బీరువా తాళాలు పగులగొట్టి 54 గ్రాముల బంగారు ఆభరణాలు, 23 తులాల వెండి పట్టీలు, రూ.31 వేల నగదు దొంగలు ఎత్తుకుని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దొంగతనం జరిగిన ఇళ్లను మామునూరు, క్రైం ఏసీపీలు సందర్శించారు. క్లూస్‌టీంను రప్పించి దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.



గీసుకొండ : బొడ్డుచింతలపల్లిలో ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ధర్మరావుపేట దేవాలయంలో..
ఖానాపురం: ధర్మరావుపేటలోని శివరామ క్షేత్రంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే ఆలయ కమిటీతోపాటు పూజారులు మంగళవారం దేవాలయాన్ని తెరిచి పూజలు నిర్వహించి తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం దేవాలయానికి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదును అపహరించుకుపోయినట్లు గమనించారు. సంఘటనా స్థలానికి ఎస్సై రఘుపతి, సిబ్బంది చేరుకుని పరిశీలించారు.

నల్లమాటు మత్తడి ధ్వంసం

నల్లబెల్లి: రంగాయ చెరువు నల్లమాటు మత్తడిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు మండలంలోని ఒల్లెనర్సయ్యపల్లి, రుద్రగూడెం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందాపూర్ శివారులోని రంగాయ చెరువు ఆయకట్టు కింద అధికారులు నిర్ణయించిన తైబందీ ప్రకారం పంటలు సాగుచేస్తున్నామని తెలిపారు. ఈక్రమంలో గుండ్లపహాడ్, ఇటుకాలపల్లి గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు నల్లమాటు కాల్వను ధ్వంసం చేసి సాగునీటిని వృథా చేశారని రైతులు ఎరుకల లింగారెడ్డి, అనుముల ముత్తారెడ్డి, పాకాల జయపాల్, గోపు కోటేశ్వర్, బ్రహ్మచారి, రమణాచారి, రాంచంద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నల్లమాటు మత్తడి నుంచి వృథాగా పోతున్న నీరు

యూజీడీ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పరిధి వివిధ ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. పెంబర్తి చెరువు(హసన్‌పర్తి), కోట చెరువు తదితర ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా నగరంలో ఎంపిక చేసిన చెరువుల సమీపాన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)లను అనుసంధానం చేయాలని చెప్పా రు. అండర్ గ్రౌండ్ ద్వారా పైపులు ఏర్పాటు చేసి వాటి ద్వారా మురికి నీటిని ఎస్‌టీపీలకు తరలించి శుద్ధీకరణ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నీటిని వ్యవసాయ అవసరాలకు, మొక్క ల ఎదుగుదలకు వినియోగించుకునేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈ శ్రీనివాస్, ఏసీపీ ఎర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సభలకు సహకరించాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్: జిల్లాలో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన, 21 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామ, వార్డు సభలకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. నాలుగు పథకాల క్షేత్రస్థాయిలో పరిశీలన, గ్రామసభల నిర్వహణకు అదనపు కలెక్టర్ సంధ్యారాణిను జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు వివరించారు. రైతు బంధుకు జిల్లా వ్యవసాయ అధికారి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ)ను, రేషన్ కార్డులకు జిల్లా పౌరసరఫరాల అధికారి, ఇందిరమ్మ ఇళ్లకు జిల్లా పరిషత్ సీఈఓను నోడల్ అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 11 గ్రామీణ మండలాలు, 32 జీడబ్ల్యూఎంసీ వార్డులు, నర్సంపేట, వర్ధన్నపేట వార్డులకు మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో బృందాలను నియమించినట్లు వెల్లడించారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలను సంప్రదించి పథకాలపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నంబర్ 1800 425 3424లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

గ్రామ సభల్లో అర్హులను ఎంపికచేయాలి
దుగ్గొండి: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎంపికలో అర్హులకు అన్యాయం జరగొద్దని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. ఈ నెల 26 నుంచి అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 16 నుంచి 21 వరకు మండల వ్యాప్తంగా 7 బృందాలు గ్రామాల్లో సర్వేచేస్తాయని పేర్కొన్నారు. సర్వే అనంతరం 21 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లెక్కల అరుంధతి, తహసీల్దార్ లంబు రవిచంద్రారెడ్డి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఏఓ శశికాంత్, డీటీ ఉమారాణి, ఏఈలు మంగ్యానాయక్, రఘువంశీ, ఏపీఓ శ్రీనివాస్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ సత్య శారద



దుగ్గొండి: మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి

అర్హులకు సంక్షేమ పథకాలు

పర్వతగిరి: మండలంలో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి కె.కల్పన సూచించారు. ఈనెల 26 నుంచి అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాగు భూములకు సంవత్సరానికి రూ.12వేలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద పేద కూలి కుటుంబానికి సంవత్సరానికి రూ.12వేలు అందించనున్నట్లు తెలిపారు. అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో ఫీల్డ్ సర్వే, 21 నుంచి 24 వరకు గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ ఎం.శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఎంఏఓ ప్రశాంత్, అధికారులు పాల్గొన్నారు.

జాతరలకు పోటెత్తిన భక్తజనం



కొత్తకొండ జాతర సందర్భంగా వీరభద్రుడి దర్శనానికి క్యూకట్టిన జనం (ఇన్‌సెట్‌లో) స్వామివారు



ఐనవోలు జాతరలో భక్తజన సందోహం (ఇన్‌సెట్‌లో) మల్లికార్జున స్వామివారు

సంక్రాంతి సందర్భంగా ప్రారంభమైన జాతరలకు భక్తులు పోటెత్తారు. మంగళవారంతోపాటు బుధవారం కనుమ పండుగ రోజు కూడా ఐనవోలు మల్లికార్జునస్వామివారి క్షేత్రం, కొత్తకొండ వీరభద్రుడి సన్నిధి భక్తజనంతో కిటకిటలాడాయి. ఇష్టదైవాలను దర్శించుకున్న భక్తులు మల్లన్నకు బోనాలు, వీరన్నకు కోరమీసాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. - ఐనవోలు/ఎల్కతుర్తి - 8లో▸

క్లుప్తంగా

ఎన్పీడీసీఎల్‌కు నాలుగు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణకు నాలుగు ఇప్పాయి (ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) అవార్డులు లభించాయి. ఈనెల 11వ తేదీన కర్నాటక రాష్ట్రం బెల్గామ్‌లో నిర్వహించిన 25వ రెగ్యులేటరీ అండ్ పాలసీ మేకర్స్ రిట్రీట్‌లో ఎన్పీడీసీఎల్ సీజీఎం ఆపరేషన్ రాజు చౌహాన్ అవార్డులు అందుకున్నారు. కాగా, హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు కలిసి అవార్డులను అందజేశారు.

ఐదు కిలోల ఎండుగంజాయి పట్టివేత



గంజాయిని చూపుతున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు

కేసముద్రం: ఐదు కిలోల ఎండుగంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలోని కోరుకొండపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడుకు చెందిన పఠాన్ అస్లాంఖాన్, వైజాగ్‌కు చెందిన వెదుల ప్రదీప్‌కుమార్.. వైజాగ్ సమీపంలోని సీలేరు నుంచి ఎండు గంజాయిని కారులో తరలిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు కోరుకొండపల్లి క్రాస్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఈ మేరకు రూ.1.25లక్షల విలువైన ఐదు కిలోల ఎండు గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

తొమ్మిది పిల్లలకు జన్మనిచ్చిన జర్మన్ షఫర్డ్



డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్ల సంకీస గ్రామానికి చెందిన గండు రవి రెండేళ్ల క్రితం జర్మన్ షఫర్డ్ డాగ్‌ను కొనుగోలు చేశాడు. మూడు రోజుల క్రితం అది తొమ్మిది పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఏరకం కుక్కలైనా ఒక కాన్పులో నాలుగు నుంచి ఐదు పిల్ల లకు జన్మనిస్తుంది. ఒకేసారి తొమ్మిది పిల్లలకు జన్మనివ్వడం అరుదైన విశయమని డోర్నకల్ పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. పిల్లలు అన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని రవి తెలిపారు.

తీగబారిన తీర్థాలు..

ఐలోని, కొత్తకొండ జాతరలకు పోటెత్తిన భక్తజనం

- బోనాలు, పట్నాలు, కోడెలు కట్టి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- స్వామి వార్లను దర్శించుకున్న ప్రముఖులు



ఐనవోలు: ఢమరుక నాథాలు.. శూలాల విన్యాసాలు.. జాలి ముసుగులు..గజ్జెల లాగులు, శివసత్తుల పూనకాలతో ఐనవోలు మల్లన్న క్షేత్రం మకర సంక్రాంతి పర్వదినాన మంగళవారం హోరెత్తింది. జాతర ఉత్సవాల్లో భాగంగా శివసత్తులు భక్తి పారవశ్యంతో నెత్తిన బోనం ఎత్తుకుని నాట్యం చేస్తూ స్వామివారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కాలినడకన, వివిధ వాహనాల్లో వేలాదిగా తరలివచ్చారు. జాతర ప్రాంగణంలో బోనాలు అలంకరించి వాటిపై దీపం వెలిగించారు. బోనం ఎదుట పట్నం వేయించి ఒగ్గుపూజారులతో మల్లన్నను స్తుతింప చేశారు. సంతాన సాఫల్యం కోసం కొందరు మహిళలు ఆలయం చుట్టూ తడి బట్టలతో వరం పట్టారు. కోర్కెలు తీరిన భక్తులు మల్లన్నకు కోడెలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.కాగా, మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఐలోనిలో బోనం ఎత్తుకుని నృత్యం చేస్తున్న భక్తులు

మార్నేని వంశస్తుల పెద్దరథం

మార్నేని వంశస్తులు తమ కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన చీర, సారె, ఒడిబియ్యం, పసుపు, కుంకుమను ఒక పెట్టెలో భద్రపరిచారు. పెద్ద పూల(శిడి) రథాన్ని అలంకరించి ఆ పెట్టెను అందులో ఉంచారు. టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఇంటి వద్ద నుంచి శిడిరథం(రాత్రి ప్రబల బండి) సాయంత్రం 6.30కి బయలుదేరింది. గ్రామంలో వీధి వీధిన తిరుగుతుండగా భక్తులు రథానికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని తూర్పు ద్వారం వద్ద రథంలో వెంట తెచ్చిన పెట్టెను ఆలయంలోకి తీసుకెళ్లి తమ మొక్కులు అప్పజెప్పారు. రథ నిర్వాహకుడు మార్నేని రవీందర్‌రావు-మధుమతి దంపతులను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్ సన్మానించారు. కాగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ రాష్ట్రనాయకులు వన్నాల వెంకట రమణ, కొండేటి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి.. మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం.. చారిత్రక మల్లన్న ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. బుధవారం ఎండోమెంట్ వరంగల్ డీసీ సంధ్యారాణి, ఏసీ సునీత.. స్వామి వారిని దర్శించుకున్నారు.



విద్యుత్ కాంతులతో ఐలోని మల్లన్న క్షేత్రం



కొత్తకొండలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వీరభద్రుడి సన్నిధిలో..

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. స్వామి వారిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. భద్రకాళి సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా, ముందు ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజుతో కలిసి మాట్లాడారు. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విరాజిల్లాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ఎండ్లబండ్ల రథాలు..

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం కొత్తపల్లికి చెందిన సుమారు 75 ఎడ్లబండ్లను రథాలుగా అలంకరించుకుని గ్రామస్తులు సాయంత్రం 5గంటలకు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా కొత్తకొండ జాతరకు బయలు దేరాయి. మహిళలు రథాలకు హారతులిచ్చి సాగనంపారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, హనుమకొండ తదితర జిల్లాల నుంచి సుమారు లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు. కాగా, బుధవారం కనుమ ఉత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటప పూజ, నందీశ్వర పూజ, హారతి, మంత్రపుష్పం, బలిహరణ నిర్వహించారు. ఈ వేడుకల్లో అర్చకుడు వినయ్‌శర్మ, రాజన్న, సదానందం, రాంబాబు, వీరభద్రయ్య, ఆలయ ఈఓ కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో సీఐలు పులి రమేశ్, ప్రవీణ్‌కుమార్, పుల్యాల కిషన్ ఎస్సైలు సాయిబాబు, దివ్యతో పాటు 450మంది పోలీసులు జాతరలో బందోబస్తు నిర్వహించారు. కాగా, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, డీఎంహెచ్ఓ అప్పయ్య, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, బీజేపీ నేత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వొడితెల ప్రణవ్ స్వామివారిని దర్శించుకున్నారు.



గుమ్మడి కాయతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

నిర్వహణ లోపంపై మంత్రి అసహనం

కొత్తకొండ జాతర నిర్వహణపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు, పాలకవర్గ కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లోపించింది. దీంతో జాతర విధుల నిర్వహణకు వచ్చిన కొందరు పోలీస్ అధికారుల ప్రవర్తనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అదే సమయంలో దేవాదాయ శాఖ అధికారులపై భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో వీటిని గ్రహించిన మంత్రి అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గర్భగుడిలోకి వెళ్లకుండా బయటనుంచే మొక్కులు చెల్లించి వెళ్లిపోయారు. ఆలయ వసతి గృహం వద్దకు చేరుకున్న ఆయన అక్కడ నేలపై కూర్చుని నిరసన తెలిపారు. మంత్రి ప్రభాకర్ వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, పార్టీ నాయకులు ఉన్నారు.



కొత్తకొండ జాతరలో ఆకట్టుకున్న మేకల రథం

హత్యచేసి.. పూడ్చిపెట్టారా?

- వివాహితను చంపినట్లు ప్రచారం
- మానుకోట సిగ్నల్‌కాలనీలో ఘటన
- రెండు రోజుల క్రితం పోలీసులకు సమాచారం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో ఓ వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టారనే ప్రచారం బుధవారం కలకలం రేపింది. సదరు వివాహిత సంబంధీకులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. కాగా, వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సిగ్నల్ కాలనీకి చెందిన భూపతి అంజయ్య ఇంట్లో సుమారు 3 సంవత్సరాల నుంచి పాటిలక్ష్మి, రాములు దంపతులు తమ కుమారుడు గోపి, కోడలు నాగమణి (35), కుమార్తె దుర్గా, అల్లుడు మహేందర్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా, వీరంతా వాటర్ అమ్మడం, చెత్త కాగితాలు ఏరుకోవడం, ఇతర కూలీ పనులు చేస్తూ ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి సమయానికి వస్తుంటారు. గోపి సుమారు ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలో భర్త తనను పట్టించుకోవడం లేదని భార్య నాగమణి రెండు నెలల క్రితం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మళ్లీ కొద్ది రోజులుగా గొడవలు జరుగుతుండడంతో ఈ క్రమంలోనే అత్తామామ, ఆడపడుచు, భర్త కలిసి నాగమణిని హత్య చేసినట్లు తెలిసింది. మృతి చెందినట్లు అనుమానిస్తున్న నాగమణి ఆడపడుచు దుర్గా కుమార్తెలు మౌనిక, మానస తమ అత్తను మామ, అమ్మమ్మ, తాత, మా అమ్మ కలిసి చంపారని కాలనీవాసులతో చెప్పినట్లు విశ్వనీయ సమాచారం. ఘటన జరిగిన వెంటనే అదే సమయంలో అక్కడే ఉన్న లక్ష్మి తమ్ముడు వారిని నిలదీయగా అతడిపై వేడినీళ్లు పోయడంతో గాయపడి అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను వివరణ కోరగా వివాహితను హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారనే అనుమానంపై సిగ్నల్ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి యజమాని అంజయ్యకు సమాచారం ఇచ్చామని, అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.



వివాహితను హత్యచేసి పూడ్చిన చోటుగా అనుమానిస్తున్న ప్రాంతం

అనారోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్‌లోని ఇందిరా నగర్ కాలనీలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కూలీ పనిచేసుకునే గుడెల్లి రాజు (37) కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల చుట్టు తిరిగినా నయం కావడం లేదు. దీంతో మనస్తాపం చెందిన రాజు.. బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు.

మంగపేటలో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

మంగపేట: మండల కేంద్రానికి చెందిన చెట్టి నాగమ్మ(80) మండల కేంద్రం పరిధిలోని సండ్రోని ఒర్రె అటవీ ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగమ్మ భర్త చాలా కాలం క్రితం మృతి చెందగా మండల కేంద్రంలోని సినిమాహాల్ వీధిలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం సండ్రోని ఒర్రె అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పశువుల కాపరులకు అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు.

రెగ్జిన్ షాపుల్లో చోరీ

- రూ.3 లక్షల విలువైన సామగ్రి అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారులోని రెండు రెగ్జిన్ షాపుల్లో చోరీ జరిగింది.ఈ ఘటనలో రూ.3 లక్షల మేరకు సామగ్రి అపహరణకు గురైంది. బాధితుల కథనం ప్రకారం.. శనిగపురం శివారులో ముత్యాల రాజేశ్, పెండ్ర నాగరాజు రెగ్జిన్ షాపులు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే మంగళవారం తమ షాపులు బంద్ చేసి ఇళ్లకు వెళ్లారు. బుధవారం మళ్లీ షాపులు తెరుద్దామని వచ్చి చూడగా వెనుక వైపున ఉన్న రేకులను తొలగించి దొంగలు చోరీకి పాల్పడిన విషయాన్ని గమనించారు. రాజేశ్ షాపులో రూ.2 లక్షలు, నాగరాజు షాపులో రూ. లక్ష విలువైన సామగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. కాగా, గతంలోనూ మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీసుస్టేషన్ల పరిధుల్లో సుమారు ముప్పైకిపైగా రెగ్జిన్ షాపుల్లో చోరీలు జరగగా ఫిర్యాదులు చేసినా ఆచూకీ లభించలేదని బాధితులు పేర్కొన్నారు.

బైక్ ఢీ.. మహిళా కూలీ మృతి



లక్ష్మి (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందింది.ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బైరాన్‌పల్లికి చెందిన బండి లక్ష్మి(56) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. మంగళవారం రాత్రి కిరాణా షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరింది. హనుమకొండ నుంచి సిద్దాపురం వైపునకు వస్తున్న ఓ బైక్ లక్ష్మిని ఢీకొనగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పోలంపల్లిలో కారు ఢీకొని వృద్ధురాలు..



సమ్మక్క (ఫైల్)

కాటారం: ఇంటి ముందు చలిమంట కాచుకుంటున్న ఓ వృద్ధురాలిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మహాముత్తారం మండలం పోలంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరినేని సమ్మక్క (60) ఈ నెల 13న రాత్రి తన ఇంటి ఎదుట చలిమంట కాచుకుంటుంది. ఈ క్రమంలో ఓ కారు.. సమ్మక్కను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో గమనించిన సోదరుడు మానేటి బాపు 108లో భూపాలపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మానేటి బాపు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ కాటారం మండలం మేడిపల్లికి చెందిన గుంటి రాకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిప్పంటుకుని గృహిణి..

జనగామ: నిప్పంటుకుని ఓ గృహిణి మృతి చెందింది.ఈ ఘటన జనగామ పట్టణం గుండ్లగడ్డలో చోటు చేసుకుంది. ఎస్సై చెన్న కేశవులు కథనం ప్రకారం.. గుండ్లగడ్డకు చెందిన అనిష్ బేగం(36) ఈ నెల 14న ఇంట్లో గ్యాస్ పొయ్యిపై పాలు వేడి చేస్తోంది. ఈ సమయంలో మంటలు చెలరేగి ఆమెకు అంటుకున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మహబూబ్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి వృద్ధుడు..



వెంకటియా మృతదేహం

కేసముద్రం: ఎస్సారెస్పి ఉపకాల్వలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని క్యాంపు తండాజీపీ శివారు రాంసింగ్‌తండాలో చేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు కథనం ప్రకారం..తండాకు చెందిన బానోత్ వెంకటియా(70) తన ఇంటి ఎదుట ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ వద్దకు వెళ్లాడు. కాలుజారడంతో అందులోపడి నీటమునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షో విజయవంతం



సక్సెస్ మీట్‌లో సభ్యులు

కాజీపేట: రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత ఏర్పడిన నేపథ్యంలో వరంగల్ జిల్లా క్రెడాయ్ కార్యవర్గం వినూత్నంగా ఆలోచించి కొత్త సంవత్సరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రాపర్టీ షోతో రియల్ రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చామని క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు, పాంచజన్య డెవలపర్స్ చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ పీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ప్రతి ఒక్కరి స్వప్నమైన సొంత ఇల్లుకు సంబంధించిన ప్రతి వస్తువు చివరకు ఇంటికి తాళం వరకు స్టాళ్లలో ఏర్పాటు చేశామన్నారు. ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, విల్లాలు, బ్యాంకర్లు, ఇంటీరియర్ ప్రొడక్ట్స్, శానిటరీ, లిఫ్ట్, కార్లు, సోలార్, టైల్స్, పెయింట్స్, యూపీవీసీ విండోస్ తదితర స్టాళ్లకు చక్కటి ఆదరణ లభించిందన్నారు. సంతృప్తికర వ్యాపారం సాగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయిని అమరేందర్ రెడ్డి, శాఖమూరి అమర్, ఎం.రవీందర్ రెడ్డి, జారతి మనోహర్, లెక్కల రజనీకాంత్ రెడ్డి, మెతుకు రాజ్‌కుమార్, గాదె రాజేందర్ రెడ్డి, వెంకట మల్లారెడ్డి, వరుణ్ అగర్వాల్, యూత్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

దామెరలో దొంగల హల్‌చల్

- రూ.6. 68 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలంలో దొంగలు రెచ్చిపోయారు. దామెర, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్, ఒగ్లాపూర్ గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. సుమారు రూ. 6 లక్షల 68 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. శాయంపేట సీఐ రంజిత్ రావు కథనం ప్రకారం.. రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు ముస్త్యాలపల్లికి చేరుకుని గ్రామానికి చెందిన శాతరాశి ఈశ్వరమ్మ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 2 తులాల బంగారం, రూ.50 వేల నగదు చోరీ చేశారు. తక్కళ్లపహాడ్‌లోని పలు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేసి సాధ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. అనంతరం ఒగ్లాపూర్ చేరుకుని కనుకుంట్ల జ్ఞానేశ్వర్ ఇంటి తాళం పగలగొట్టి రూ.లక్ష నగదు, 15 తులాలవెండి ఆభరణాలు అపహరించారు. అక్కడి నుంచి దామెరకు చేరుకుని మాదారపు విజయ కిరాణా షట్టర్ తెరిచి అందులో ఉన్న 7 తులాల బంగారం, 13 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు మంగళవారం ఉదయం తమ ఇళ్లకు వెళ్లి పరిశీలింగా చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పరకాల ఏసీపీ సతీ శ్‌బాబు, శాయంపేట రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంగళవారం తెలిపారు.

ముగిసిన సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందుకుంటున్న ఆలిండియా పోలీస్ టీం

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదు రోజుల పాటు కొనసాగిన 34వ సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి 24 మహిళల జట్లు, 28 పురుషుల జట్లతో పాటు ఆల్ ఇండియా పోలీస్, ఎస్ఎస్‌బీ జట్లు పాల్గొన్నాయి. టీం, డబుల్స్, రేగు, క్వాడ్ విభాగాల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉత్కంఠ పోరులో ఆల్ ఇండియా పోలీస్ మెన్ అండ్ ఉమెన్ జట్లు డబుల్స్, రేగు, క్వాడ్ ఈవెంట్లలో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఆతిథ్య తెలంగాణ క్రీడాకారులు డబుల్స్ ఈవెంట్‌లో ఉమెన్ టీం రెండో స్థానంలో, మెన్ టీం మూడో స్థానంలో నిలిచాయి. మిగిలిన మూడు ఈవెంట్లలో క్వార్టర్ ఫైనల్స్‌లోనే ఇంటికి చేరాయి. మంగళవారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలకు సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ యోగేందర్ సింగ్ దయ్యా, పీసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రిక్కల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్నాథస్వామి, ప్రేమ్‌రాజ్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కునమల్ల జితేంద్రనాథ్, బాధ్యులు ధన్‌రాజ్, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు ఇలా..

టీం ఈవెంట్

మెన్	ఉమెన్
మణిపూర్	ఎస్ఎస్‌బీ
ఢిల్లీ	నాగాలాండ్
ఎస్ఎస్‌బీ	మణిపూర్
అస్సాం	ఉత్తరప్రదేశ్

డబుల్స్ ఈవెంట్

ఆల్‌ఇండియా పోలీస్	ఆలిండియా పోలీస్
బిహార్	తెలంగాణ
హరియాణా	ఢిల్లీ
తెలంగాణ	కేరళ

రేగు ఈవెంట్

ఆలిండియాపోలీస్	ఆలిండియాపోలీస్
ఢిల్లీ	హరియాణా
మణిపూర్	నాగాలాండ్
రాజస్థాన్	ఎస్ఎస్‌బీ

క్వాడ్ ఈవెంట్

ఆలిండియా పోలీస్	ఆలిండియా పోలీస్
ఎస్ఎస్‌బీ	మణిపూర్
మణిపూర్	ఎస్ఎస్‌బీ
బిహార్	నాగాలాండ్